# తృష్ణ ముళ్లు

శ్రీ 'విజయ - రాఘవ'

★

(గతసంచిక తరువాయి)

గంగాధరరావు మంచి భావుకుల్లో ఒకడు. మల్లిఖార్జునరావుకి గంగాధరరావు అండలేకపోతే ఆ వూళ్లో అతను అంతకాలం వుండలేక పోయేవాడేమో అనిపిస్తుంది. ఆనాడు మామూలు వేళ దాటింతరువాత భోజనంచేసాడు, మల్లిఖార్జునరావు. ఆ మధ్యాహ్నంపూట సరోజిని మూటాముల్లే సర్దుతోంది. బ్రహ్మాజీరావు కుటుంబరావు యింటికి వెళ్లాడు. కుటుంబరావంటే ప్రసాదరావు తమ్ముడు కాదు. వీడు మరోక కుటుంబరావు. ఆ వూళ్లో కల్లా సపర్నాసి. తాజ్ మహల్ బీడీ కాలుస్తూ మల్లిఖార్జునరావు -

"ఎక్కడికో ప్రయాణమవుతున్నట్లున్నావ్"

"మానానొచ్చాడుగా - పండక్కి గొల్లపల్లి తీసికెల్తా నంటున్నాడు - వెడదామని బయలుదేరుతున్నా." సరోజిని చీరెలు మడతపెట్టుకొంటూ అన్నది.

"అయితే కోలవెన్ను రావన్నమాటేగా!"–

"ఎందుకు? గొల్లపల్లి పోతున్నాగా" -

"ఎందుకేమిటి? శలవులకు యిద్దరం పోదామనుకున్నాంగా!"

"మానాన్న నన్నుతీసికెల్తానంటున్నప్పుడు మరి... మీతో యెలాగ." -

"అదేమిటి? తలకాయలేకుండా మాట్లాడుతావ్. మీనాన్న ముఖ్యమా! నేను ముఖ్యమా!" మల్లిఖార్జునరావు తాడో, బొంగరమో తేల్చుకొన్నట్టుగానే మాట్లాడదల్చాడు.

"ఏమో! నేను గొల్లపల్లి వెళ్లదామనుకొంటున్నా, వెడతానుకూడా, కోలవెన్ను రాను." యీ మాటలు సరోజిని నోటినుండి, ఆలిండియా రేడియో తెలుగు వార్తలు చదివే రంగనాధరావు గొంతులోంచి వచ్చేవిగా వచ్చేటప్పటికి, మల్లిఖార్జునరావుకి బుర్ర తిరిగి పోయింది.

"పతియే సతులకు పరమదైవమన్న సూక్తులు యిటువంటి వాళ్లుండబట్టి భ్రష్టమై పోతున్నాయి. చేసుకొన్న పురుషున్ని వదిలిపెట్టి పుట్టింటికి వెడతానవే స్త్రీని యేమని వర్ణించారో గ్రంథాల్లో అతనికి తెలియకుండా పోయింది. పెళ్లినాడు పంచరత్నాలని, ఆశీస్సులని పద్యాలు వ్రాసినవారు మాదాంపత్యం యిలావుండాలని, అలా వుండాలని యెవరెవరితోనే పూతికేపోల్చి వర్ణించి బాగుపడండి" అని చెప్పారు కాని, "యిలాంటి జీవితం ముందుముందు నీకు సంభవింపపోతోందని, జాగ్రత్తగా వుండమని యెవ్వరూ హెచ్చరికకూడా చెయ్యలేక పోయేరే" అని పరిపరి విధాల మల్లిఖార్జునరావు దారితెన్నూ దొరక్క ఆలోచనలోనే వున్నాడు.

ఆ రోజు సాయంత్రమే నాలుగంటలకు బ్రహ్మాజీరావుతో సరోజిని బయలుదేరింది. వాగిట గుమ్మంలో బ్రహ్మాజీవెనుక సరోజిని నిల్చుండటం, మల్లిఖార్జునరావు వసారాలో పడకకుర్చీలో పడుకోవడం గంగాధరరావు చూస్తూనే వున్నాడు. వాకిట్లోకి వచ్చిన గుర్రపుబండిలో పెట్టె, రెండు సంచులతో సహా సరోజిని యెక్కి కూర్చొంది. బ్రహ్మాజీరావు బండిదగ్గర నిల్చుని -

"మల్లిఖార్జునరావ్" - అన్నాడు.

"ఏమిటన్నట్లు" తలెత్తి చూసాడు.

"మరి మేం వెడుతున్నాం, జాగ్రత్త" అన్నాడు.

"జాగ్రత్తండీ! - వెళ్లిగానే వుత్తరం వ్రాస్తా - జవాబు వ్రాయండి — "బండి కదులుతున్న సమయంలో సరోజిని ఆఖరి మాటలు మల్లిఖార్జునరావుకి అరికాలి మంట నెత్తికెక్కేలాగు చేసాయి.

"సగం పీడావదిలింది - " అని నిట్టూర్పు విడిచి చివరికొచ్చిన బీడిని ఆఖరి దమ్ము గట్టిగాలాగి బలంకొద్దీ విసిరాడు. పైపంచతో మొహంతుడుచుకొన్నాడు. యింతలో గంగాధరరావు మెల్లగా వచ్చి ఎదురుగావున్న మంచం వాల్చుకొని కూర్చున్నాడు.

"బ్రహ్మాజీరావు యింకా యేమిటీ సిగ్గులేకుండా అంటూ వెళ్లాడు" - గంగాధరరావు చిరాగ్గా అడిగాడు.

"సిగ్గులేని మొండి పీనుగు. యేదో వాగాడు.." మల్లిఖార్జునరావు అంతకన్నా మంచి తిట్టు తిట్టలేకపోయాడు.

"ఏదో జాగ్రత్త ... అంటున్నారేమిటి?" ... గంగాధరం యింకా గుచ్చి అడుగుతున్నాడు.

"వాడి బొంద జాగ్రత్త. యిక వాడిమాట యెత్తకు. పంచ మహాపాపాలు చుట్టుకొంటయి. చెప్పు తీసుకొని ఆనాడే తన్నినట్లయితే యీ నాడు వీడాటలు యింతబాగా సాగి వుండక పోయేవిగా. పైగా దాంతోకూడా అనిపిస్తున్నాడు - వుత్తరాలు వ్రాయమని, వెళ్లేరోజున చెప్పకపోతే నోట మూసుకోపోయాడా! ఎవడు చెప్పమని యేడిశాడు. దానికంతకన్నా సిగ్గూ యెగ్గూ లేకుండా మాట్లాడింది."

మల్లిఖార్జునరావుకి పేరుకున్న కక్కసంతా వెళ్లగ్రక్కేసాడు. హృదయంలో సగంభారం తగ్గినట్లైంది. చేసుకొన్న భర్తనుంచి భార్యను ఎడబాటు చేయడం - తన స్వార్థానికి వినియోగించుకోవడం - యిలాంటి పనులు చేసే, అందులో తండ్రి నామధేయం గల్గిన వాళ్లుంటారనేది కళ్లారా చూసిన తరువాత నమ్మాడు మల్లిఖార్జునరావు.

♦ ♦ ♦

దసరా సెలవులకు కోలవెన్ను వెళ్లాడు మల్లిఖార్జునరావు. తిరిగి వచ్చేటప్పటికి ఆ వూరి వారే అతనికి క్రొత్తవారయ్యారు. ఎప్పుడూ చూస్తున్న మొగాలే క్రొంగ్రొత్త రూపాల్లో కనిపించసాగాయి. ఎప్పుడూ వింటున్న మాటలే చిత్రవిచిత్రంగా వినబడుతున్నాయి. ఏమిటిదంతా! ఎందుకీసంత! ఎవరివల్ల తనకీరభస! గంగాధరం అరుగుమీద చేరే సభ్యులంతా కోరి కోరి తన మొగాన్ని చూస్తున్నట్టుగా వుంది. తాను యేంచేస్తున్నది కాపుకాసి, పొంచి చూస్తున్నట్లుగా వుండేది. తనేం మాట్లాడినా క్రొత్త అభిప్రాయాలైనట్లు, క్రొత్త చేష్టలతో వున్నట్లు, క్రొత్తజీవితంలోకి అడుగుపెట్టినట్లుగా వుండేది. "ఏమిటీ విపరీతం!" అని గంగాధరంతో ఒకనాడు ముచ్చటించాడు. గంగాధరం "సావధానంగా చెప్పాలా ఒకటి రెండు మాటల్లో తేల్చేస్తే బాగుంటుందా!" అని వూహించాడు. చెప్పదల్చుకొంది, సరిగ్గానే చెబుదాం. తప్పేముంది. మనస్సులో ఒకటి పెట్టుకొని, పెదవులమీదనుంచి మరొకటి జారవిడచడం తనికే అవమానమనిపించింది. గన్నవరంకి వచ్చేదార్లో ఒక తూంవుంటే అక్కడ సమావేశపరచి మల్లిఖార్జునరావుని, గంగాధరం సవిస్తరంగా — హృదయంలోకి చొచ్చుకుపోయేలాగు చెప్పాడు.

"తాను విడిచి వేయాలనే వుద్దేశ్యంతోనే సరోజినిని విడిచివేశానా _ !

చేసుకొన్న భార్యతో కాపురం చేయడం చేతకాక, పరాయి స్త్రీని చేరదీసి దాని కౌగిలింతల పారవశ్యంలో కులమతాలు భ్రష్టపరిచానా.

తాను బ్రహ్మాజీరావుని చీటికి – మాటికి వచ్చి నప్పుడల్లా డబ్బు అడుగుతూ వచ్చాడా ! -

సరోజిని పుట్టింటనుంచే పిల్చితెచ్చుకోక ఒంటరి జీవితం గడపడంలోగల రహస్యమేమిటి ? - !"

ఒక్క సారిగా సినిమారీల్సులాగా తిరిగినట్లు న్నాయి. -

"గంగాధరం యేమిటీ విపరీతం. యీనాడు నా బ్రతుకు యిలా తెల్లవారింది. నిజంగా నా సంసారానికి బ్రహ్మాజీరావు నిప్పు పెట్టినవాడు కాదంటావా ! నాసంసారపతనానికి అతను కారకుడు కాదంటావా! నువ్వైనా నిజం చెప్పు. అప వాదులు యింత బలంగా వుంటే, నేనేంచేసేది. ఎలా తలెత్తి తిరగను. నా సంగతి నీకు తెలియంది కాదుగా. యిన్నిఖండాలకు మాటలు సాగురించి లోకులు మాలకాకి మూకలాగా అపభ్రంశాలు కూస్తుంటే యేంచెయ్యమంటావ్.

మల్లిఖార్జునరావు కళ్లల్లో నీళ్లుతిరిగినయి. గుండె దడదడ అంత కంతకు యెక్కువైంది. కొంచెంసేపు యిద్దరూ మౌనంగా వుండిపోయి ప్రొద్దువాలుతున్న వేళలో యింటి ముఖం పట్టారు.

"గులాబి పువ్వుకి ముళ్ళున్నా ఆదరించడం జరుగు తుంది."

"తుమ్మపువ్వుకి ముళ్లున్నా ఆదరించడానికి మనస్సు వొప్పుకోదు.

"గులాబి పువ్వు వికసించి, మానవునికి ఆనందం కలిగించి, అతని కరకమలాల్లో ఆనంద పారవశ్యం పొందుతుంది. కవికుమారులు, కావ్యాలు వ్రాస్తారు. 'గులాబి' ని కోరే ప్రేయసీ ప్రియులు వుంటంవల్లనే అది మనకు కనబడుతూ నిత్యమూ, మనల్ని చూస్తూ వుంటుంది.

"తుమ్మ పువ్వు విచ్చిన'మరుక్షణమే తల్లిపాదలపై పడుతుంది.

కాని, రెండు భగవత్ దృష్టిలో ఒకటే. రెండిటిది పూల జాతే.

♦ ♦ ♦

"మానవజాతి ఒకటే" - "వారిగుణాలు వేరు"

"ముళ్ళన్నీ ఒకటే జాతి"–వాటి "తీరు–చేష్టలు వేరు."

"మొగ్గలన్నీ వికసించవలసిన పూవులే. పూసిన పూలన్నీ వాడి, రాలిపోవుడం మామూలే. కాని, బ్రతికినన్నాళ్లు వేటి అందం అవి చూపుతూవుండటం వాటి బాధ్యత."

♦ ♦ ♦

బ్రహ్మాజీరావు వల్ల మల్లిఖార్జునరావుకి - సరోజినికి దూరం యేర్పడింగదా! -

బ్రహ్మాజీరావు స్థలం వల్ల అలివేలు మంగకి-! సత్య వతికి తగాదా వచ్చిందిగదా ! –

బ్రహ్మాజీరావు వల్ల సుబ్బారావు - శోభనాచల పతి - రంగారావు మాట్లాడుకోరుగదా ! -

బ్రహ్మాజీరావంటే సయాన రక్త సంబంధి అన్న గారైన శరభయ్య కుపుక్కున వుమ్మేస్తాడుగదా ! -

ఇక బ్రహ్మాజీరావు వల్ల బాగుపడిందెవరు ?

తుమ్మముళ్లు లాంటి బ్రహ్మాజీరావు, రావమ్మ, సత్యవతి, సరోజిని యింకా యిటువంటి ఘన కార్యాలు యెన్ని చేయదల్చుకొని వున్నారో ! ముళ్లున్నయ్యని తెలిసికూడా మూర్ఖంగా పోతే నుప్పు రాక మెప్పు యెలావస్తుంది. యీనాడు మల్లి ఖార్జునరావుకి కాలుతీసి కాలుపెట్టినప్పుడల్లా బజా రులో తుమ్మముళ్లు గుచ్చుకోకుండా యెలా వుంటయి. కంప దూరంగా వుంచినా ముళ్లెక్కడికి పోతయి.

## 18

ఒకనాడు ప్రసాదరావు మాచవరం వచ్చాడు. యీసారి రావమ్మ యింట్లో బసచేసాడు. సహ

జంగా ఆయనొచ్చాడంటే అందరిండ్ల వాళ్లకి అమితమైన అనురాగం తలెత్తుతుంది. చాలా సంతోష పడతారు. పక్షపాతం చూపనివ్యక్తి యెప్పుడూ ప్రపంచంలో పేరు తెచ్చుకొంటూనే వుంటాడు. కాని మల్లిఖార్జునరావు సంగతి విన్ననాటినుంచి పూర్తిగా విషయం తెలిసినా, తప్పెవరిదో సూక్ష్మంగా యోచించి మనస్సులో వుంచుకొన్నాడు. తుమ్మచెట్టు తగాదా విన్ననాడుకూడా న్యాయం అనేది యెవరి ప్రక్కతూగిందో తెలుసుకొని హృదయపేటికలో దాచుకొన్నాడు.

"బ్రహ్మాజీరావు రాను రాను ప్రవర్తిస్తున్న ప్రవర్తననుబట్టి తన్నుదానూహించుకొన్నా ఆ సమస్యలన్నీ తెగని గొలుసులాగా తయారైంది. యిదంతా యేదో గ్రహమహత్యం కాకపోతే యేమిటని" ఆత్మను సమాధాన పరచడం జరుగుతోంది.

"నిజంగా బ్రహ్మాజీరావు ఒకప్పుడు చాలా తెలివితేటలుగలవాడు. మంచి గౌరవంకూడా సంపాదించుకొన్నాడు. ఎంతో వివేకంగలవాడు. మరి యీ నాటికి అతని జీవితం అపవాదుల పాలయిందంటే కర్మ కాకపోతే మరేమిటి? రామకోటివ్రాసి, హోమాలుచేసి సోమయాజులనిపించుకొన్న బ్రహ్మాజీరావుకు చేకూరిన పుణ్యఫలం యిదేనా! యిటువంటి అమర్యాదపు కృత్యాలు చేయడానికేనా!"

ప్రసాదరావుకికూడా ఆనాడు బ్రహ్మాజీరావంటే హేయం జనించింది. "ఎంత చీదరించుకొన్నా సాటివాడు కాకపోడుగా! - ప్రాణతుల్యుడు కాకపోడుగా! —"

సాయంత్రం చల్లగాలికి ప్రసాదరావు యీ ఆలోచనల్లోంచిలేచాడు కాలవగట్టుకి -

నేనూ విశ్రాంతికి అక్కడికేచేరాను. ఆయన ఆత్మీయులలో ఒకన్ని కాబట్టి మందహాసంతో. "రారా-" అని పిల్చాడు. మెల్లగ చేరాను. చేరిన వాన్ని పల్కరించకుండా యెలా వుంటాను! కాసేపు నా వుద్యోగ విశేషాలు, కుటుంబ విషయాలు పిచ్చాపాటిలో అంశాలుగ పెట్టుకొన్నాం. అన్నిటికీ ఆప్యాయంగానే జవాబిస్తూ వస్తుండగా - నేనే వూరుకోక—

"మామయ్యా! మల్లిఖార్జునరావు బ్రతుకు యిలా తెల్లవారిపోయిందేమిటి? అసలు మనవాళ్ల అభిప్రాయమేమిటి? యీ విషయంలో జరిగిన తప్పంతా బ్రహ్మాజీరావుదా? సరోజినిదా? మల్లిఖార్జునరావుదా? - ఎవరిది?"

"ఎవరిదని రూఢిగా చెప్పగలం!"

"మల్లిఖార్జునరావు సంసారం చెడిపోవడానికి ముఖ్యకారకుడు బ్రహ్మాజీరావే-" సుబ్బారావు యీ మాటని యెన్ని వందలసార్లైనా విసుగు లేకుండా అనగలడు.

"తన సంసారాన్ని తనే చేతులారా చెడగొట్టుకొన్నాడు. ఒకళ్లనంటే యేంలాభం వూరికే!" రామమ్మ, సత్యవతి, తిండి తిప్పలు మానుకునైనా యీ వార్తని పదిమందికి వెళ్లడిచేయడానికి సాహసింపగలరు.

"ఇదంతా కర్మ కాకపోతే మరేమిటి చెప్పండి"- శోభనాచలపతి పర్యవసానంగా భావించి, తూచి యీ వాక్యాన్ని సమయానుకూలంగా వదలగలడు.

"ఎవర్నని యేంలాభంలేదు." అలివేలుమంగ తాయారమ్మ, ఎవరన్నా ఆ సంసారాన్నిగూర్చి అడిగితే చెప్పే మాట యిదొక్కటే. అదైనా స్థలాస్థల విచక్షణా జ్ఞానంతో.

"నాకెందుకీ గోలంతా. నాకేం చెప్పొద్దు. నేను వినలేను. యెవరికేం చెప్పడానికి నాకేం తెలియదు. ఎవరేడుపు వాళ్లేడుస్తారు. ఒకళ్లని గురించి మనకెందుకయినా!" రంగారావు ఉవాచ యింతకంటే యేమీలేదు.

అటువంటప్పుడు తప్పెవరిదని గట్టిగా చెప్పగలం? అయినంతవరకువిని విచారపడి సానుభూతి చూపడం తప్ప చేయగల్గినమేలుకూడా నాకేమీ కనిపించడం లేదు. ఒక్కటి మాత్రం తప్పుగా కనిపిస్తోంది. ఏమంటే? భర్తతో సహకరించవలసిన బాధ్యత భార్యకుంది. భార్యతో అనురాగంగా బ్రతుకవలసిన బాధ్యత భర్తకుంది. యీ బాధ్యతాయుతమైన భారాన్ని మోయడానికి వంతులు కుదరకపోవకుండొచ్చు. పక్షపాతం యిరువురిలోను నిండివుండి వుంటుంది. యీ కాలంలో స్త్రీ కంటే పురుషుడే అధికుడని ఒక అభిప్రాయంకూడా వుందిగా! స్త్రీకి కూడా సంపూర్ణ స్వాతంత్రం కావాలని మహిళా సంస్థలు గర్జించుతున్నాయిగా. వీటి నాధారంచేసుకొని స్వేచ్ఛాయుతంగా సరోజిని ప్రవర్తించడంవల్ల మల్లిఖార్జునరావు యీ సందర్భంలో నిరసనచూపించి, నిలిపివేయడానికి ప్రయత్నించి వుండొచ్చు. సరోజిని, మల్లిఖార్జునరావు ప్రవేశపెట్టిన కట్టుబాట్లకు అలవడలేక, అలమటించి యెలాగైనా తప్పుకుపోదామని ప్రయత్నించి వుండొచ్చు. యిటువంటి పరిస్థితుల్లో బ్రహ్మాజీరావు బలం సరోజినివైపు మొగ్గడంవల్ల, మల్లిఖార్జునరావు బ్రతుకు బాట ప్రక్కన తుమ్మచెట్టు మొలిచి, కాలు కదిపినప్పుడల్లా తుమ్మముళ్లు గుచ్చుకొంటున్నాయి. ఆ బాధే చివరకు అతనికి మిగిలింది. యీ మిగలడంకూడా ఒక బాధే. బాధపడతామేమో అని ముందుగా జాగ్రత్తపడటం కూడా బాధే. యీ బాధకు కల్పించుకొంటే కారణాలు చాలా వుంటయి. బాధ అనుభవించేవాడికి కొన్నాళ్లకది పాతదైపోతుంది. క్రొత్త క్రొత్తగా కొందరికి తయారవుతూ వస్తుంది. కల్పించుకొనేవారి మనస్తత్వాల్నిబట్టి వుంటుందా రూపం.

ఇంతకీ ఎంత చెప్పుకున్నా మల్లిఖార్జునరావు సంసారం అనూ, అతని బ్రతుకే అనూ, మొత్తానికి చెడిపోయినట్లేగా లెక్క. బాగుపడకపోతుందంటావ్. అది మనం చెప్పలేనిమాట. వూహాకందని సమస్య. అతని జీవితం మళ్ళా చిలవల పలవలతో క్రొత్త రూపం దాల్చడం మనం చూడమేమో! ఒకవేళ చూస్తామేమో యెవరు చెప్పగలరు. "యీ మధ్య అతనిమీద చాలా అంభాండాలువేశారు. కాని అవన్నీ కల్పనలే అని గట్టిగా చెప్పాల్సిందే" అంటూ ప్రసాదరావు మల్లిఖార్జునరావు జీవితాన్ని సమీక్షించేటప్పటికి, బ్రహ్మాజీరావే అతని బ్రతుక్కి అంతరాయం కలిగించిన వ్యక్తి అని నాకు తోచింది.

"అంతా విన్నావ్. అందరన్న మాటలుకూడా విన్నావ్. మరి నువ్వేమంటావ్ అతని జీవితంపట్ల" అని ప్రసాదరావడిగేటప్పటికి జవాబుకోసం కొంచెమాలోచించి—

"అవును. కాళ్లకు చెప్పులుండటం చాలా మంచిది. మనం నడిచేదార్లో ఒక్క ముళ్లేగాదు, పురుగు పుట్రా, రాయి రప్పాకూడా వుండొచ్చు. యెక్కడేముంటుందో అని ముందుగా వూహించి, నడకసాగించంగదా! కర్మంకాలితే తాడు పామై కరిచినా కరవచ్చు. అందుకని సాధ్యమైనంతవరకు కాలు కదిపేముందు అన్నీ జాగ్రత్తగాచూసి కదుపుతుండటం మంచిదని అనుకుంటున్నాను" అన్నా.

"అవును. నువ్వు చెప్పిందికూడా సబబుగానే వుంది. కాని, అంత జాగ్రత్త ఆ సమయంలో వుండొద్దూ. ఇంతకీ అదృష్టాదృష్టాలమీదవుంది యిదంతా" అన్నాడు ప్రసాదరావు.

ఇద్దరం కాల్వగట్టుమీదనుంచి లేస్తుండగానే తుమ్మల్లో ప్రొద్దుకూకబోతోంది. గోధూళివేళలో గృహోన్ముఖులమయ్యాం.